క్లుప్తంగా

ఓటు హక్కు విలువైనది



ఓటు నమోదుపై సిబ్బందితో చర్చిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

ఏలూరు టౌన్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రతి వ్యక్తికీ విలువైనదని ఏలూరు 7వ డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పర్యవేక్షణలో ఏలూరు నగరంలో ఓటరు వెరిఫికేషన్ చేపట్టారు. సచివాలయ, రెవెన్యూ శాఖ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు నమోదు, మార్పులు చేర్పులు, ఇతర వివరాలపై ఆరా తీస్తున్నారు. వన్‌టౌన్ 7వ డివిజన్ పరిధిలో ఓటరు వెరిఫికేషన్‌ను కార్పొరేటర్ శ్రీదేవి పరిశీలించారు. ప్రతి వ్యక్తికీ ఓటు హక్కు వినియోగించుకునేలా సిబ్బంది పనిచేయాలని కోరారు. సచివాలయంలోనూ సిబ్బందితో ఓటరు వెరిఫికేషన్‌పై చర్చించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఏలూరు టౌన్: తల్లి మందలించిందని తీవ్ర మనస్థాపానికి గురైన యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడ్ని ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఏలూరు రూరల్ ఎస్సై లక్ష్మణబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంక గ్రామానికి చెందిన భలే కృష్ణంరాజు (27) కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కృష్ణంరాజు తల్లి కొంతకాలం క్రితం కువైట్ దేశం ఉపాధి కోసం వెళ్లింది. ఆమె డబ్బులు పంపుతూ ఉండగా కృష్ణంరాజు సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నాడు. ఈ విషయం తెలిసిన తల్లి అతడ్ని మందలించింది. తీవ్ర మనస్థాపానికి గురైన కృష్ణంరాజు ఈనెల 26న విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు అతడిని ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఆర్డీఓ పెంచల కిషోర్‌కు వినతి పత్రం అందజేశారు. రాగిజావ తయారీకి గ్యాస్, వంట పాత్రలు సరఫరా చేయాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మెనూ చార్జీలు పెంచాలని కోరారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు మాట్లాడారు. వై.చంద్రకళ, కె.విజయలక్ష్మి, టి.స్వర్ణకుమారి, కె.విజయ, ఎం.నాగమణి పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

- ఇంటింటా ఫీవర్ సర్వే
- లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యం

ఏలూరు టౌన్: భారీ వర్షాలు, తుఫానులు, వరదల నేపథ్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. నిత్యం ఫీవర్ సర్వే పేరుతో వైద్యులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యస్థితిపై ఆరా తీస్తున్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్లి వైద్యం అందేలా చర్యలు చేపట్టారు. పక్షం రోజులుగా భారీ వర్షాలు కురుస్తూ ఉండడంతో రోడ్లు, డ్రెయినేజీలు, ఇంటి పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. దోమకాటుతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలతో ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయి. వైరస్, బాక్టీరియల్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల కారణంగా ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఏలూరు నగరంలో ముఖ్యంగా మురికివాడల్లో ఫీవర్ సర్వే చేస్తూ.. ప్రజలు రోగాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతానికి నగరంలో పెద్దగా విషజ్వరాల ప్రభావం లేదని సర్వేలో తెలుస్తోంది.



ఏలూరులో ఫీవర్ సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

సర్వే ఇలా..

ప్రాంతాలు	హౌస్‌హోల్డ్	ఫీవర్ సర్వే	శాతం
ఏఏఎస్ కాలనీ	6037	4388	72.69
గజ్జలవారి చెరువు	7444	5334	71.66
జ్వాలాపహరేశ్వరస్వామి కాలనీ	4181	3058	73.14
కొత్తపేట	6066	4655	7674
లంబాడీ పేట	4745	2855	60.17
మోతేవారి తోట	10975	9059	82.54
ఎంఆర్‌సీ కాలని	3623	2291	63.23
పవర్‌పేట ఏరియా	9141	5713	62.23
తాపీమేస్త్రి కాలని	6725	5399	80.28

పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టాలి



భారీ వర్షాల నేపథ్యంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. మురుగునీరు, వ్యర్థాలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. వైరస్ వల్ల కళ్ల కలక, దోమలతో డెంగీ, టైఫాయిడ్ వంటి రోగాల బారిన పడే అవకాశాలు ఉంటాయి. అనారోగ్యంగా ఉంటే వెంటనే సమీపంలో ప్రభుత్వాసుపత్రి వైద్యుడిని సంప్రదించాలి. యూపీహెచ్‌సీల్లో పరీక్షలు, మందులు ఉచితంగానే అందిస్తారు. ఫీవర్ సర్వేతో ప్రజల ఆరోగ్యస్థితిని తెలుసుకుంటూ దానికి అనుగుణంగా నివారణ చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ నాగేశ్వరరావు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ, ఏలూరు

విషజ్వరాలతో జాగ్రత్త



వర్షాకాలం రావటంతో వాతావరణంలో ఏర్పడే మార్పులతో వైరల్ ఫీవర్లు వస్తుంటాయి. విష జ్వరాలు సులువుగా వ్యాప్తి చెందుతూ ఉంటాయి. ప్రజలు విష జ్వరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. జ్వరం వస్తే వెంటనే సమీపంలో ప్రభుత్వాసుపత్రి వైద్యుడి వద్దకెళ్లి పరీక్షలు చేయించుకుని, వైద్య చికిత్స పొందాలి. విష జ్వరాలను అశ్రద్ధ చేయటం ద్వారా తీవ్ర అనారోగ్యంతో ఇబ్బందులు పడే అవకాశాలు ఉంటాయి. ముందుగానే వైద్యుడి వద్దకు వెళ్లి చికిత్స పొందితే ఎలాంటి ప్రమాదం ఉండదు.

– డాక్టర్ జోషి, ఫీవర్ సర్వే ఇన్‌చార్జి

డెంగీపై అప్రమత్తత అవసరం

ఏలూరు టౌన్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని, డెంగీపై అప్రమత్తంగా ఉండాలని 38వ డివిజన్ ఇన్‌చార్జి తోట శివ ప్రజలకు సూచించారు. డెంగీ నివారణ మాసోత్సవ ముగింపు కార్యక్రమాన్ని ఈదర సుబ్బమ్మదేవి ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు డెంగీపై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ డెంగీపై విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ డెంగీ కారక దోమ ఏడిస్ ఈజిప్ట్ ఇంటి పరిసరాల్లోని మంచినీటి నిల్వ ప్రాంతాల్లో వృద్ధి చెందుతుందని చెప్పారు. ఎయిర్ కూలర్లు, రుబ్బురోళ్లు, మూతల్లేని నీటి తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, ప్లాస్టిక్ వస్తువులు, వాడేసిన కొబ్బరి బొండాలు వంటివాటిలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో డెంగీ దోమ పెరుగుతుందని వివరించారు. వారానికి ఒకసారి తప్పకుండా నీటి తొట్టెలు శుభ్రం చేసుకోవాలన్నారు. కొత్తపేట యూపీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్నలేఖ మాట్లాడుతూ డెంగీ, మలేరియాకు సంబంధించి పరీక్షలు హాస్పిటల్‌లో ఉచితంగా చేస్తామని, మందుల కిట్స్ సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం కుటుంబరావు, హెల్త్ అసిస్టెంట్స్ శ్రీనివాసరావు, రమేష్, ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి, వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్త సీహెచ్ దేవి, పి.దేవి, సుమలత, సుబ్రహ్మణ్యేశ్వరి, శివ పార్వతి, లక్ష్మీకాంతం, అనురాధ, స్కూల్ సిబ్బంది ఉన్నారు.



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న దృశ్యం

రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ 18వ డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో అభివృద్ధి పనులను కార్పొరేటర్ ఇనపనూరి కేదారేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇనపనూరి జగదీష్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. సుమారుగా రూ.40లక్షలతో నాలుగు సీసీ రోడ్లు నిర్మాణం, బాప్టిస్ట్ పేటలో రెండు డ్రెయినేజీలను నిర్మించేలా చర్యలు చేపట్టారు. జగదీష్ రోడ్ల నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని హయాంలోనే నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయని జగదీష్ తెలిపారు. ఈ ప్రాంతంలో గతంలో ఎమ్మెల్యే నాని భారీ ఎత్తున పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వటంతోపాటు, కాలనీ నిర్మాణానికి కృషి చేశారని వివరించారు. ఇదే ప్రాంతంలో కొత్తగా రోడ్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు.



రోడ్ల నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న జగదీష్

కార్పొరేషన్ షాపులకు వేలం ఖరారు

ఏలూరు టౌన్ : ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న షాపులకు వేలంపాట నిర్వహించి, అద్దె ప్రాతిపదికన కేటాయిస్తూ అనుమతులు మంజూరు చేశామని నగర మేయర్ షేక్ నూర్జహాన్ తెలిపారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ చాంబర్‌లో ప్రొసీడింగ్ ఆర్డర్స్‌ను మేయర్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు చేతుల మీదుగా పాటదారులకు అనుమతి పత్రాలను అందజేశారు. నగరంలోని బుద్ధపార్క్ సమీపంలో ఆరు షాపులు, న్యూ ఫిష్ మార్కెట్‌లో 14 షాపులను వేలంపాటలో దక్కించుకున్న వ్యక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఒక్కో షాపును 25 సంవత్సరాలకు లీజు ప్రాతిపదికన నెలకు రూ.3 వేలు అద్దె చెల్లించేలా నిర్ణయించామన్నారు. ఈ 20 షాపులను అద్దెకు ఇవ్వటంతో నెలకు రూ.60 వేలు, సంవత్సరానికి రూ.7.20 లక్షలు నగరపాలక సంస్థకు ఆదాయంగా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నగర కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు, 7వ డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, రెవెన్యూ అధికారి అరుణ, సెక్రటరీ ప్రభుదాసు, సిబ్బంది ఉన్నారు.



షాపు మంజూరు పత్రం అందజేస్తున్న మేయర్ నూర్జహాన్ పెదబాబు తదితరులు

పంటబోదెల పూడికతీత పనులు

ఏలూరు రూరల్ : వ్యవసాయశాఖ ఏడీ వై.సుబ్బారావు, ఎంఏఓ జీవనసంధ్య, వీఆర్వో శ్రీకాంత్ తదితరులు గ్రామాల్లో పంటబోదె పూడిక, ఆక్రమణలపై చర్యలు చేపట్టారు. సోమవారం పోణంగిలో చేపల చెరువు కారణంగా పూడికపోయిన పుంతకాలువ పూడికతీత చేపట్టారు. కాలువలో జారిపోయిన మట్టితో పాటు పేరుకుపోయిన చెత్త చెదారం ప్రొక్లెయిన్‌తో తొలిగించారు. దీంతో ముంపు చేలల్లో నీరు కిందకు పారుతోంది. ముంపు కారణంగా అప్పటికే సుమారు 12 ఎకరాల్లో నారు పాడైపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చర్యలపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు. తంగెళ్లమూడి ఆర్టీసీ కాలనీ ముంపుకు కారణమైన వ్యాసగాని నది ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని రైతులు ఇరిగేషన్ అధికారులను కోరుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వ్యాపారులు కొందరు నది గట్టు ఆక్రమించడం వల్ల ఏటా 100 ఎకరాలు ముంపుబారిన పడుతుందన్నారు. పరిసర ప్రాంతాల్లో ఇళ్ల చుట్టూ సైతం వరదనీరు నిలిచిపోయిందన్నారు.



పోణంగిలో పంటబోదెపై ఆక్రమణలు తొలిగిస్తున్న అధికారులు

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు



ట్రాఫిక్ స్టేషన్ వద్ద మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సైలు

ఏలూరు టౌన్: మైనర్ బాలలు మోటారు సైకిళ్ల నడిపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ఏలూరు ట్రాఫిక్ ఎస్సైలు బి.శ్రీనివాసరావు, శ్రీధర్, వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలతో నగరంలో ట్రాఫిక్ పోలీసులు మోటారు సైకిళ్ల తనిఖీలు చేపట్టారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో వాహనాలు నడుపుతోన్న 18 మంది మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి తల్లిదండ్రులను ఏలూరు ట్రాఫిక్ స్టేషన్ వద్దకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మోటారు సైకిల్ నడపటం నేరమన్నారు. మైనర్లు వాహనాలు డ్రైవ్ చేయటం వారి ప్రాణాలకే కాకుండా ఎదుటివారికీ ప్రమాదం ఏర్పడుతుందని వివరించారు. వాహనచోదకులు మోటారు సైకిల్ రికార్డులను వెంటే ఉంచుకోవాలని సూచించారు. మోటారు సైకిల్ నడిపే సమయంలో హెల్మెట్, కారులో ప్రయాణించేవారు తప్పకుండా సీటు బెల్టు విధిగా ధరించాలన్నారు.

కళ్ల కలక కలకలం



దెందులూరు: ఇటీవల గ్రామ శివారు ప్రాంతాల్లో కళ్ల కలక బాధితులు అధికమవుతున్నారు. బాధితులు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. దీనిపై సోమవారం దెందులూరు సీహెచ్‌సీలో ముఖ్యమంత్రి ఈఐ కేంద్రం ఫారా మెడికల్ ఆప్తమాలజీ ఆఫీసర్ పి. విజయభాస్కర్ మాట్లాడుతూ కళ్ల నొప్పి, దురద, వెలుతురు చూడలేకపోవడం, కళ్ల నుంచి చీము లక్షణాలు కనిపిస్తే కళ్ల కలకగా భావించాలన్నారు. కళ్ల కలక నివారణకు చేతులు, కళ్లు, రోజుకూ 10–15 సార్లు శుభ్రమైన నీటితో కడుక్కోవాలన్నారు. కళ్లు నలపకూడదని, శ్రమ తగ్గించాలన్నారు. ఫోన్, టీవీ చూడటం, మసాలా కలిగిన ఆహార పదార్థాలు తినకూడదన్నారు. మంచి నీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలన్నారు. ఈ ఇన్‌ఫెక్షన్ నివారణకు చుక్కల మందు రోజుకు రెండు సార్లు వేయాలన్నారు. ఓఫ్లోసాసిన్ ఐ డ్రాప్స్, జంటామైసిన్ ఐ డ్రాప్స్, నియోస్పోరిన్ ఐ డ్రాప్స్, ఇబ్రూప్రొఫెన్, పారాసిటమల్ వాడాలన్నారు.

చెట్టు పట్టాలు మంజూరు చేయాలి

ఏలూరు (టూటౌన్): దళిత మహిళా రైతులకు చెట్టు పట్టాలు మంజూరు చేయాలని దళితసేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. లింగపాలెం మండలం తోచిలక, రాయుడపాలెం గ్రామానికి చెందిన 25 మంది దళిత మహిళా రైతులు అటవీ భూమిలో ప్రస్తుతం జీడిమామిడి సాగు చేస్తున్నారని తెలిపారు. దళిత సేన నాయకులు, దళిత మహిళా రైతులు పాల్గొన్నారు.

సార్వా పంట నమోదుపై శిక్షణ

ఏలూరు రూరల్: సార్వా సాగులో జియోఫెన్సింగ్ ఆధారిత పంట నమోదు చేయాలని వ్యవసాయశాఖ ఉపసంచాలకులు వై.సుబ్బారావు అన్నారు. సోమవారం ఏలూరు ఐఏడీపీ హాల్లో ఆర్బీకే కేంద్రాల సిబ్బందికి పంట నమోదుపై శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసాయశాఖ అమలు చేస్తోన్న అన్ని పథకాలకూ ఈ క్రాఫ్ (పంట నమోదు) కార్యక్రమంలో కీలకమన్నారు. దీనిపై రైతులను చైతన్యవంతులను చేయాలన్నారు. పంటల బీమా, పంట నష్టం, ధాన్యం కొనుగోలు మొదలగు అన్ని పనులకు ఈ క్రాఫ్ ప్రధానమని వివరించారు. కౌలు కార్డుల పంపిణీ 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సిద్ధంగా ఉంచాలన్నారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఫణికుమార్ మాట్లాడుతూ ముంపు చేలల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏలూరు, దెందులూరు, పెదపాడు, పెదవేగి మండల వ్యవసాయ అధికారులు ఎ.జీవనసంధ్య, జి.రమేష్, వి.ప్రదీప్‌కుమార్, ఎం ప్రియాంక, హబ్ మేనేజర్ డి.వెంకటేశ్వర్లు, మార్క్‌ఫెడ్ డీఎం గుప్తా, ఆర్బీకేల సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్బీకే సిబ్బంది శిక్షణలో మాట్లాడుతున్న సుబ్బారావు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	136	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	60	ములక్కాడలు	07-10
బెండకాయలు	44	కంద	40
పచ్చిమిర్చి	80-90	బీట్‌రూట్	40
కాకర కాయలు	54	కీరా దోస	40
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	54	అల్లం	180-270
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	20	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	24-30	బఠాణీ	--
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	116
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	37
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	27
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	34
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	రద్దు
ఏలూరు –తిరుపతి	16.00	4830	30

23, 24 తేదీల్లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభ



మహాసభ కరపత్రం విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ ఆగస్టు 23, 24 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్నట్టు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భజంత్రీ శ్రీనివాసరావు తెలిపారు. మహాసభ కరపత్రాన్ని స్థానిక ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం స్ఫూర్తి భవనంలో సోమవారం విడుదల చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్మికుల సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. యూనియన్ జిల్లా నాయకులు పూనపాముల విగ్నేష్, తొర్లపాటి బాబు, ముత్యాల నాగేంద్ర మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు హెల్త్ అలవెన్స్‌లు, ఆర్జిత సెలవులు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ఏలూరు నగర నిర్వాహక అధ్యక్షుడు దొడ్డిగర్ల నాగబాబు, ఉపాధ్యక్షులు బంగారు దుర్గాప్రసాద్, కొత్తూరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొఠారు పరామర్శ

దెందులూరు: అక్కిరెడ్డిగూడెంలో అనారోగ్యంతో ఉన్న వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఆంధ్రప్రదేశ్ రైతాంగ సమాఖ్య నాయకులు మునుసూరి సీతారామయ్యను సోమవారం ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు పరామర్శించారు. సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం అదే గ్రామంలో చెముట వెంకటేశ్వరరావు కుమారుడు ఇటీవల మృతి చెందాడు. చెముట వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను కొఠారు రామచంద్రరావు పరామర్శించారు. దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డినాని, గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, సొసైటీ చైర్మన్ బోయపాటి గాంధీ, వైఎస్సార్ సీపీ నాయకులు ఐరుకులపాటి సాంబశివరావు, మొటపర్తి గాంధీ, మునుసూరి వెంకటేశ్వరరావు, మరీదు రాజా, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

నాడు–నేడు పనులు వేగవంతం చేయాలి

దెందులూరు: మండలంలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నాడు–నేడు పథకం పనులు వెంటనే తొలి ప్రాధాన్యత పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సోమవారం దెందులూరు ఎంఈఓ కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు నాడు–నేడు మన బడి పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బడి బయట పిల్లలను బడిలో చేర్పడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల వర్క్ పుస్తకాలను, నోటు పుస్తకాల సరిచేసి, ప్రతిరోజు సరిదిద్ది సంతకం చేసి ఆ రోజు తేదీ వేయాలని విద్యార్థులందరినీ ఎఫ్ఏ–1 పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. అనంతరం గ్రామాలవారీగా నిర్వహిస్తున్న నాడు- నేడు పనులను సమీక్షించి వచ్చే నెల 31లోపు పూర్తి చేయాలన్నారు.



ఎంఈఓ కార్యాలయంలో హెచ్‌ఎంల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్

హెచ్‌ఎం మాకొద్దంటూ పాఠశాల వద్ద నిరసన

- పాఠశాల అభివృద్ధి కమిటీ, తల్లిదండ్రుల ఫిర్యాదు
- విచారణ నిర్వహించిన డీఈఓ



తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ శ్యాంసుందర్

పెదవేగి : వివిధ ఆరోపణలపై సస్పెండైన ప్రధానోపాధ్యాయుడిని మళ్లీ అదే పాఠశాలకు నియమించడంపై తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధాన గేటు వద్ద ఆందోళన చేశారు. పెదవేగి మండలం కొప్పాక హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న సీహెచ్ ప్రసన్నాంజనేయులును గతంలో పలు ఆరోపణలతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం విదితమే. సస్పెన్షన్ ఎత్తివేయడంతో తిరిగి మళ్లీ అదే పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా ఆయనను నియమిస్తూ కాకినాడ ఆర్జేడీ ఉత్తర్వులిచ్చారు. ప్రసన్నాంజనేయులు సోమవారం విధులకు హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయుడు పాఠశాలకు వచ్చారన్న సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎ.వెంకటనారాయణ ఆధ్వర్యంలో కొందరు తల్లిదండ్రులు పాఠశాల వద్ద ప్రసన్నాంజనేయులు వద్దంటూ ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని పెదవేగి ఎంఈఓ సీహెచ్ బుధవ్యాస్ వారికి నచ్చచెప్పినా వారు ఆందోళన కొనసాగించారు. తమ పిల్లలకు టీసీ ఇచ్చి వేరే పాఠశాలలకు పంపించాలని, లేదంటే ప్రధా నోపాధ్యాయుడిని వేరే పాఠశాలకు బదిలీ చేయాలంటూ ఆందోళనను కొనసాగించారు. దీంతో సమాచారం అందుకున్న డీఈవో శ్యాంసుందర్ ఉన్నత పాఠశాలకు చేరుకొని విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందితో విడివిడిగా చర్చించారు. అందరూ ప్రధానోపాధ్యాయుడు వద్దని తెలిపారు. ప్రసన్నాంజనేయులు వద్దంటూ డీఈవోకి తల్లిదండ్రుల కమిటీ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డీఈవో శ్యాంసుందర్ మాట్లాడుతూ నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కి నివేదిస్తామని తెలిపారు. ఎంఈఓ సీహెచ్ బుద్దవాస్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.